Happy Work Anniversary. 1st Year

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF PEN

సంపుటి : 3 సంచిక : 96 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 11 ఏప్రిల్ 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 96 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Saturday 11 April 2026 PAGES : 8 PRICE : 3/-


## భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 10)

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం (అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం) ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారవుతోంది. ఈ మెగా ప్రాజెక్టును జాతికి అంకితం చేయాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. ప్రధాని షెడ్యూల్ లభ్యతను బట్టి జూలై 5 లేదా 8వ తేదీల్లో ఒక రోజును, లేనిపక్షంలో ఆగస్టు 17 లేదా 19 తేదీల్లో మరొక తేదీని ప్రారంభోత్సవానికి కేటాయించాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ విమానాశ్రయ పనులు తుది దశకు చేరుకున్నాయి. ▶మిగతా 2లో

## మహిళలకు రూ.3వేలు, ఆరు నెలల్లో యూసీసీ అమలు
## బెంగాల్‌లో భాజపా మ్యానిఫెస్టో



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 10)

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భాజపా తన మ్యానిఫెస్టోను విడుదల చేసింది. 'సంకల్ప్ పత్ర' పేరుతో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా శుక్రవారం దీన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై అమిత్‌షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ ప్రభుత్వ 15 ఏళ్ల పాలన పశ్చిమబెంగాల్‌కు ఒక పీడకల అని అభివర్ణించారు. రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం భయంతో జీవిస్తున్నారని.. వారు మార్పు కోరుకుంటున్నారని అమిత్‌షా అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక బెంగాల్‌లోని అన్నివర్గాలను నిరాశ నుంచి బయటపడేస్తామన్నారు. పంట నష్టాల కారణంగా ▶మిగతా 2లో

## ప్రజల జీవితాల్లో మార్పుతోనే అభివృద్ధి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 10)

'ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే అక్కడ నిర్మాణాలు చేపట్టడమే కాదు.. ప్రజల జీవితాల్లో మార్పు కూడా తీసుకురావాలి. ముఖ్యంగా మౌలిక వసతులు మెరుగుపరచాలి. ప్రజల జీవితాలకు పూర్తి భరోసా ఇవ్వాలి' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలోని అంతర్వేది దేవస్థానం గ్రామంలో నిర్మించిన సమగ్ర రక్షిత మంచినీటి ప్రాజెక్టును గురువారం ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం స్థానిక తీర గ్రామాల ప్రజలు, అధికారులను ఉద్దేశించి పవన్ ప్రసంగించారు. 'గతంలో అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చినప్పుడు తీర గ్రామాల ప్రజలు తమ తాగునీటి కష్టాలను చెప్పి వినతిపత్రాలు ఇచ్చారు. వారికిచ్చిన మాట ప్రకారం రూ.17.33 కోట్ల జల్‌జీవన్ మిషన్ నిధులతో సమగ్ర రక్షిత మంచినీటి ప్రాజెక్టును చేపట్టి, ఈ వేసవిలోనే ఉపయోగంలోకి తీసుకొచ్చామ'ని అన్నారు. గొంది, అంతర్వేది, అంతర్వేదికర, పల్లిపాలెం గ్రామాల్లోని 13 నివాసిత ప్రాంతాలకు చెందిన సుమారు 30 వేల మంది దాహార్తి తీర్చామన్నారు. ఇదేరోజు ఆయన.. రూ.5 కోట్ల ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులతో గుడిమెళ్లంక సమగ్ర రక్షిత మంచినీటి ప్రాజెక్టుకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ▶మిగతా 2లో

# అమరావతిలో క్వాంటం నవశకం..


## ఏప్రిల్ 14న దేశంలోనే తొలి టెస్ట్ ఫెసిలిటీని ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 10)

ప్రపంచ సాంకేతిక పటంలో ఆంధ్రప్రదేశ్‌కు, ముఖ్యంగా రాజధాని అమరావతికి కీలక స్థానం కల్పించే దిశగా మరో చరిత్రాత్మక అడుగు పడుతోంది. నవశకం టెక్నాలజీ అయిన క్వాంటం కంప్యూటింగ్ రంగంలో దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన స్వదేశీ క్వాంటం టెస్టింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీని ముఖ్యమంత్రి చంద్రబాబు ఏప్రిల్ 14న ప్రారంభించనున్నారు. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. ఈ ఫెసిలిటీ అందుబాటులోకి రావడంతో, దేశంలో క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ కేంద్రాన్ని కలిగిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవనుంది. గన్నవరంలోని మేధా టవర్స్‌లో 'అమరావతి 1ఙ' పేరుతో, రాజధాని పరిధిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 'అమరావతి 1ా' పేరుతో రెండు అత్యాధునిక క్వాంటం టెస్ట్ బెడ్స్‌ను సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. ముఖ్యంగా ఎస్ఆర్ఎం వర్సిటీలో ఏర్పాటు చేసిన ఫెసిలిటీని విద్యార్థులు, పరిశోధకుల కోసం 'ఓపెన్ యాక్సెస్' ప్రాతిపదికన అందుబాటులో ఉంచనున్నారు. ▶మిగతా 2లో

## కార్యదర్శుల పనితీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 10)

వివిధ శాఖల కార్యదర్శుల పనితీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. కేబినెట్ భేటీ ప్రారంభమైనప్పటికీ.. అజెండా మాత్రం మంత్రులకు రాలేదని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రస్తావించారు. అజెండా ముందే వస్తే.. స్టడీ చేసుకొని కేబినెట్‌కు వచ్చే వీలుండేదని అభిప్రాయపడ్డారు. దీనిపై సీఎం స్పందిస్తూ వ్యవస్థలు ఉపయోగపడాల్సిందిపోయి.. క్లిష్టంగా మారుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. గతంలో కార్యదర్శులు సందేహాలు నివృత్తి చేసేందుకు చొరవ చూపేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన దాదాపు 3 గంటలకు పైగా మంత్రివర్గ సమావేశం సాగింది. అజెండా అంశాలు ముగిశాక వివిధ అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు.డీమ్డ్ యూనివర్సిటీలను రాష్ట్రంలో ఎక్కువ ప్రమోట్ చేయాలని సీఎం సూచించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో తక్కువ డీమ్డ్ వర్సిటీలు ఉన్నాయని, ప్రభుత్వ కార్యక్రమాలను మంత్రులు బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. కూటమి ఎమ్మెల్యేలు కూడా ఇదే అనుసరించాలని తెలిపారు. జలధారకు ఉపాధి హామీ నిధులొచ్చేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. వీలైనన్ని సూర్యఘర్, పీఎం కుసుమ్ కనెక్షన్లు ఇవ్వాలన్నారు. వ్యాధుల నివారణకు కృషి చేసేలా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

## జగన్ పై షర్మిల విమర్శలు... ఘాటుగా కౌంటర్ ఇచ్చిన రోజా

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 10)




వైసీపీ అధినేత జగన్‌పై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేసిన విమర్శలకు వైసీపీ నేత రోజా గట్టిగా బదులిచ్చారు. కూటమి పార్టీలకు షర్మిల దత్తపుత్రికగా మారారని విమర్శించారు. "అలాంటి మీకు మా నాయకుడు జగన్ గురించి మాట్లాడే అర్హత ఉందా?" అని రోజా సూటిగా ప్రశ్నించారు."కోట్లాది మంది దేవుడిగా పూజించే వైయస్ఆర్ గారిని జీవితాంతం వ్యతిరేకించిన చంద్రబాబుతో చేతులు కలిపింది మీరు కాదా? జగన్ గారి పతనం కోసం తపనపడుతున్నది మీరు కాదా? జాతీయ స్థాయిలో కూటమి పార్టీలను కాంగ్రెస్ వ్యతిరేకిస్తే మీరు మాత్రం ఇక్కడ ఎందుకు చేతులు కలిపారో ప్రజలకు తెలియదనుకుంటున్నారా? వైయస్ఆర్ గారికి నిజమైన వారసుడు మా జగనన్నే అని ప్రజలు ఎప్పుడో నిర్ణయించారు. రాష్ట్ర రాజకీయాలను, ప్రజల భవిష్యత్తును పేకాటగా చూస్తున్న మీకు రాజకీయ పరిణితి ఏ మాత్రం ఉందో అర్థమవుతోంది" అంటూ రోజా విమర్శనాస్త్రాలు సంధించారు.

## వైఎస్సార్ మరణానికి జగనే కారణమన్న అనుమానాలున్నాయి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 10)

వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానికి ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డే కారణమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. జగన్ నైజం చూస్తుంటే అప్పట్లో బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు నిజమే అనిపిస్తున్నాయన్నారు. రాజశేఖరరెడ్డి



మృతి, వైఎస్ వివేకానందరెడ్డి హత్యతో లబ్ధి పొందిన వ్యక్తి జగనేనని విమర్శించారు. సచివాలయంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. "జగన్ తన తండ్రి వైఎస్సార్‌ను మానసిక క్షోభకు గురి చేశారు. రాష్ట్రానికి సీఎం కావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాజశేఖరరెడ్డి సీఎంగా ఉంటే జగన్ సీఎం కాలేరని అందరికీ తెలుసు. ▶మిగతా 2లో

## చిన్నారుల అక్రమ రవాణా ముఠాలపై కఠిన చర్యలు తీసుకోండి



2

## రాయలసీమ ప్రాజెక్టులపై చంద్రబాబు వివక్ష
## అనంతపురం జిల్లా వైసీపీ నేతల ధ్వజం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 10)

రాయలసీమ ప్రాంత ప్రాజెక్టుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి నుంచి చులకన భావంతోనే ఉన్నారని, సీమ అభివృద్ధిని ఆయన అడ్డుకుంటున్నారని అనంతపురం జిల్లా వైసీపీ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సాధన కోసం పోరాటాన్ని ఉద్ధృతం చేస్తూ అనంతపురంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు.రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను అర్ధాంతరంగా నిలిపివేయడం వెనుక ఒక పెద్ద కుట్ర దాగి ఉందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆరోపించారు. తాను చెబితేనే చంద్రబాబు ఈ పనులు ఆపేశారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించినా, దానిపై మన ముఖ్యమంత్రి మౌనంగా ఉండటం సీమ ప్రజల పట్ల ఆయనకున్న నిర్లక్ష్యాన్ని చాటుతోందని దుయ్యబట్టారు. మాజీ మంత్రి శైలజానాథ్ మాట్లాడుతూ, శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 800 అడుగుల నీటి మట్టంలో ఉన్నప్పుడే నీటిని తరలించే ▶మిగతా 2లో

మొదటి పేజీ తరువాయి

# అమరావతిలో క్వాంటం నవశకం..

దీని ద్వారా వారు క్వాంటం కంప్యూటింగ్ ప్రక్రియను ప్రత్యక్షంగా వీక్షించి, పరిశోధనలు చేసేందుకు వీలు కలుగుతుంది. మూడు దశాబ్దాల క్రితం ఐటీ విప్లవంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిన చంద్రబాబు, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీతో ఏపీ భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నారు.

**హార్డ్‌వేర్ తయారీకి కేంద్రంగా అమరావతి**

కేవలం సాఫ్ట్‌వేర్ అల్గారిథమ్స్‌కే పరిమితం కాకుండా క్వాంటం కంప్యూటర్ల హార్డ్‌వేర్ తయారీలోనూ స్వయం సమృద్ధి సాధించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం. ఈ ఆశయ సాధనలో భాగంగానే అమరావతిలో ఈ టెస్టింగ్ ఫెసిలిటీలను ఏర్పాటు చేశారు. మైనస్ 273 డిగ్రీల సెల్సియస్ అత్యంత శీతల ఉష్ణోగ్రత వద్ద పనిచేసే ఈ కేంద్రాల్లో, క్వాంటం కంప్యూటర్లకు అవసరమైన పరికరాలను పరీక్షించి, సర్టిఫికేషన్ ఇస్తారు.

ఇటీవలే 30కి పైగా క్వాంటం హార్డ్‌వేర్ తయారీ సంస్థలతో సీఎం సమావేశమై, అమరావతిని దేశ క్వాంటం హార్డ్‌వేర్ నెట్‌వర్క్‌కు యాంకర్ నోడ్‌గా తీర్చిదిద్దాలని నిర్దేశించారు. క్రయోజెనిక్స్, ప్రెసిషన్ ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో స్వదేశీ ఉపకరణాల తయారీకి ఈ కేంద్రం ఊతమివ్వనుంది.

**గ్లోబల్ హబ్‌గా క్వాంటం వ్యాలీ**

అమరావతిని ప్రపంచంలోని మొదటి 5 క్వాంటం హబ్‌లలో ఒకటిగా నిలపాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉద్దండరాయునిపాలెంలో 50 ఎకరాల్లో 'అమరావతి క్వాంటం వ్యాలీ'ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఇందులో భాగంగా అంతర్జాతీయ టెక్ దిగ్గజం ఐబీఎం భాగస్వామ్యంతో 133 క్యూబిట్ సామర్థ్యమున్న శక్తివంతమైన క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కానుంది. టీసీఎస్, ఎల్ అండ్ టీ, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ వంటి సంస్థలు ఈ ప్రాజెక్టులో పాలుపంచుకుంటున్నాయి.

నూతన ఔషధాల ఆవిష్కరణ, వాతావరణ అంచనాలు, సెమీ కండక్టర్ల డిజైన్, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో కీలక పరిశోధనలకు ఈ కేంద్రం వేదిక కానుంది. ఇప్పటికే 80కి పైగా అంతర్జాతీయ సంస్థలు, వర్సిటీలు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. క్వాంటం నైపుణ్యాల కల్పనలో భాగంగా ఐదేళ్లలో 45 లక్షల మంది నిపుణులను తయారు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది.

## చిన్నారుల అక్రమ రవాణా ముఠాలపై కఠిన చర్యలు తీసుకోండి

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 10)**

దేశంలో చిన్నారుల అపహరణలు, అక్రమ రవాణా ఘటనలు పెరిగిపోవడంపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అక్రమ రవాణా ముఠాలు దేశవ్యాప్తంగా చురుగ్గా ఉన్నాయని తెలిపింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తక్షణమే వాటి కట్టడికి చర్యలు తీసుకోకపోతే పరిస్థితి చేజారిపోతుందని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం హెచ్చరించింది. 'కోర్టు పర్యవేక్షణ మాత్రమే చేయగలదు. అంతిమంగా కార్యాచరణకు దిగాల్సింది రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీసులు, సంబంధిత సంస్థలే'నని స్పష్టం చేసింది. వ్యవస్థీకృత మానవ అక్రమ రవాణా ముఠాలను నిర్మూలించటానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించిన 2025 తీర్పు అమలుపై పలు రాష్ట్రాలు అలసత్వం వహించాయని ధర్మాసనం ఆక్షేపించింది. కొన్ని రాష్ట్రాలు సమర్పించిన చర్యా నివేదికలు తూతూమంత్రంగా ఉన్నాయని తెలిపింది. మధ్యప్రదేశ్, గోవా, హరియాణా, లక్షద్వీప్, మిజోరం, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలు నిర్దేశిత నమూనాలో నివేదికలను సమర్పించడంలో విఫలమయ్యాయని విమర్శించింది. చిన్నారుల అపహరణలు, అక్రమరవాణా జరిగే ప్రాంతాలను గుర్తించేందుకు సమీక్షా కమిటీలను నియమించాలన్న ఆదేశాలను ఇంకా 15 రాష్ట్రాలు అమలు చేయలేదని తెలిపింది. తదుపరి విచారణ ఈ నెల 29కి వాయిదా పడింది.

## భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!

సుమారు 98 శాతం పనులు ఇప్పటికే పూర్తవ్వగా, మిగిలిన ఫినిషింగ్ పనులను జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగిస్తున్నారు.

ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోవడమే కాకుండా... పర్యాటక, పారిశ్రామిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతాయని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేయగా, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అవసరమైన ఇమ్మిగ్రేషన్ హోదాను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

## మహిళలకు రూ.3వేలు, ఆరు నెలల్లో యూసీసీ అమలు బెంగాల్‌లో భాజపా మ్యానిఫెస్టో

సతమతమవుతున్న రైతులు, నిరుద్యోగ యువత, భయంతో జీవిస్తున్న మహిళలకు కొత్త దారి చూపిస్తామన్నారు. కాగా.. బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23, 29న రెండు విడతలుగా జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉండనుంది.

## ప్రజల జీవితాల్లో మార్పుతోనే అభివృద్ధి

దీంతో 29 గ్రామాల్లోని 1.27 లక్షల కుటుంబాలకు శుద్ధజలాలు అందుతాయని పవన్ కల్యాణ్ చెప్పారు. శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌పై అధ్యయనం చేసి.. 35 రోజుల్లోనే ముక్కోటి ఏకాదశి రోజున రూ.20.77 కోట్ల వ్యయంతో ఆధునికీకరణ పనులు చేపట్టామని గుర్తుచేశారు. అంతర్వేది ఆధ్యాత్మిక స్థలితో పాటు రాజోలు నియోజకవర్గ పురోభివృద్ధికి కృషిచేస్తామని భరోసా ఇచ్చారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వైకాపా పాలనలో తాగునీటి వ్యవస్థ పూర్తిగా ఛిన్నాభిన్నమైందని, కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చినా ఉపయోగించకపోవడంతో అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రతి ఇంటికీ శుద్ధ జలాలను అందించే దిశగా పనిచేస్తోందని చెప్పారు. రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్, కలెక్టర్ ఆర్.మహేశ్‌కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రాయలసీమ ప్రాజెక్టులపై చంద్రబాబు వివక్ష: అనంతపురం జిల్లా వైసీపీ నేతల ధ్వజం

అవకాశం కల్పించే ఈ ప్రాజెక్టును నిలిపివేయడం దుర్మార్గమని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం తన ప్రయోజనాల కోసం ప్రయత్నిస్తుంటే, ఏపీ ముఖ్యమంత్రి మాత్రం పొరుగు రాష్ట్ర సీఎం మాట విని సీమ ప్రయోజనాలను తాకట్టు పెట్టడం అనుమానాస్పదంగా ఉందని వ్యాఖ్యానించారు. రాయలసీమపై చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని, ఈ ప్రాజెక్టు పూర్తయితేనే రాయలసీమలో నీటి వాటాలను కచ్చితంగా పొందగలమని ఆయన స్పష్టం చేశారు.

మరోవైపు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఈ ప్రాజెక్టును 'దొంగ ప్రాజెక్టు' అని సంబోధించారంటూ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది దొంగ ప్రాజెక్టే అయితే ప్రభుత్వం ఎందుకు వెయ్యి కోట్ల రూపాయల బిల్లులు విడుదల చేసిందో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాయలసీమ రైతాంగ ప్రయోజనాల దృష్ట్యా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అత్యంత కీలకమని, చంద్రబాబు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ప్రజలందరినీ ఏకం చేసి పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. రాయలసీమకు దక్కాల్సిన న్యాయమైన నీటి వాటా కోసం రాజీలేని పోరాటం చేస్తామని ఈ సమావేశం వేదికగా వారు స్పష్టం చేశారు.

## వైఎస్సార్ మరణానికి జగనే కారణమన్న అనుమానాలున్నాయి

2009లో వైఎస్సార్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ మిస్సయ్యింది. ఆయన చనిపోయే సమయంలో జగన్ ఇతర రాష్ట్రాల్లో ఉండాల్సిన అవసరం ఏమొచ్చింది? అదే రోజున పోలవరం టెండర్లను ఆన్‌లైన్‌లోకి ఎక్కించాల్సిన అవసరమేంటి? తండ్రి మరణం ఇంకా నిర్ధారణ కాకముందే సీఎం పదవి కోసం జగన్ సంతకాల సేకరణ ఎందుకు చేపట్టారు?' అని అచ్చెన్నాయుడు ప్రశ్నలు సంధించారు. 'పదవీ వ్యామోహం ఉంటే తండ్రి, తల్లి, చెల్లి, బాబాయినైనా వదలరని ఇప్పుడు జగన్ ప్రవర్తన చూస్తుంటే అర్థమవుతోంది. వైఎస్సార్ మరణానికి రిలయన్స్ సంస్థే కారణమంటూ ఆ సంస్థపై దాడులు చేయించారు. తిరిగి వాళ్లకే రాజ్యసభ సీటు కట్టబెట్టారు. 2019లో అధికారం కోసం సొంత బాబాయిని గొడ్డలితో నరికించిన విషయం ప్రతి ఒక్కరూ చెబుతారు. తండ్రి ఇచ్చిన మాటను నిలబెట్టాలని అడిగిన తల్లిని బయటకు పంపారు. వైకాపాలో ఉన్నవాళ్లు సైతం మావిగన్ ప్రతిపాదనపై ఎగతాళి చేస్తున్నారు. ఆడవాళ్ల గురించి మాట్లాడే హక్కు జగన్‌కు ఉందా? ఆఖరికి సొంత చెల్లి షర్మిలపైనే సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు చేయించారు' అని విమర్శించారు.

## పోషణ పక్వాడ కార్యక్రమాలు విజయవంతం చేయాలి





**(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, ఏప్రిల్ 10)**

అంగన్వాడీ కార్యకర్తలు పోషణ పక్వాడ (పక్షోత్సవ) కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని సిడిపిఓ తిరుమల శెట్టి ఝాన్సీ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సముదాయంలోని ఐసిడిఎస్ సమావేశ మందిరంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు పిల్లలు, గర్భిణీలు మరియు బాలింతలకు సరైన పోషకాహారం అందించడంలో అంగన్వాడీ కార్యకర్తల పాత్ర కీలకమని పేర్కొన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పందిళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఎస్. జయకుమార్ మాట్లాడుతూ, చిన్నారుల్లో పోషకాహార లోపం, ఊబకాయం వంటి సమస్యలను గుర్తించి సమయానికి చికిత్స అందించడం అత్యంత అవసరమని చెప్పారు. అలాగే సరైన ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని వివరించారు.

ప్రథమ్ కోఆర్డినేటర్ త్రివేణి మాట్లాడుతూ, చిన్నారుల అభివృద్ధికి ఆట ఆధారిత శిక్షణ కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు. బిపిసి అధికారులు పీఎంఎంవైవై పథకానికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు, సిఎఫ్ఎంఎస్ ఐడీలు, వీసీ సమావేశాల్లో చర్చించిన అంశాలు, అలాగే పోషణ ట్రాకర్‌లో రిజిస్ట్రేషన్లు, మైగ్రేషన్ ప్రక్రియపై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. మైగ్రేషన్ వల్ల కలిగే సమస్యలను కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, ప్రథమ్ కోఆర్డినేటర్ త్రివేణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూగర్భ జలాలు పెరగాలంటే జలధారను విజయవంతం చేయాలి

**మీసాల మురళీకృష్ణ యాదవ్**




**(షణ్ముఖ వెలుగు, నూజెండ్ల, ఏప్రిల్ 10)**

తాగునీటి అవసరాలకు, సాగునీటి అవసరాలకు నీరు ఎంత విలువైనదో మనందరికీ తెలుసని, ప్రతి నీటి బొట్టును భవిష్యత్తు అవసరాల కోసం భద్రపరుచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వినుకొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్ అన్నారు. నూజెండ్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మీసాల మురళి కృష్ణ యాదవ్ పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'జలధార' 100 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తాగునీటి అవసరాలు సాగునీటి అవసరాలకు జలమే జీవనాధారం అని, ఎక్కడ జలాలు సమృద్ధిగా లభిస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకే రానున్న వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు నియోజకవర్గవ్యాప్తంగా చెరువులు, కుంటలను అభివృద్ధి చేస్తూ భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నీటి బొట్టును వృథా చేయకుండా 'జలధార' కార్యక్రమం ద్వారా నిల్వ చేసేలా ప్రణాళికలు రూపొందించిందని, ఈ విషయంలో మండల ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, జడ్పీటిసి సభ్యులు రామయ్య, ఎంపీపీ జయరామిరెడ్డి, గుంటూరు జిల్లా మాజీ పశుగణాభివృద్ధి చైర్మన్ లగడపాటి వెంకట్రావు, నూజెండ్ల సొసైటీ అధ్యక్షులు బచ్చు అంజిరెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# భూ వివాదరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు

**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 10)**



భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వం చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చీఫ్ విప్ కార్యాలయంలో వినుకొండ మండలం దొండపాడు గ్రామానికి చెందిన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను చీఫ్ విప్ జీవి ఆంజనేయులు చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2027 డిసెంబర్ నాటికి రీ సర్వే పూర్తి చేసి రాష్ట్రంలో రైతులు భూ యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో ఎవరు ట్యాంపరింగ్ చేయకుండా ఒక పైసా అవినీతికి తావు లేకుండా క్యూఆర్ కోడ్ తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. వారసత్వంగా వచ్చిన ఆస్తిపై గత వైసిపి పాలనలో జగన్ పాస్ పుస్తకాలపై ఫోటోలు వేసుకుంటే బ్యాంకుల్లో రుణాలు కూడా ఇవ్వక రైతులు నష్టపోయారన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలపై, పొలం హద్దురాలపై పేర్లు ఫోటోలు ముద్రించుకున్నారని, వాళ్లు అడిగిన భూములు ఇవ్వకపోతే 22 ఏలో పెట్టి కక్ష సాధింపు చర్యలు చేశారని, రీ సర్వే



పేరుతో అనేక తప్పులు కూడా చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రీ సర్వే చేయించి గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను సరిచేసి రాజముద్రతతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం 22 లక్షల 34 వేల మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వడం జరిగిందని, దానిలో భాగంగా వినుకొండ మండలం దొండపాడు గ్రామంలో రిసర్వ్ పూర్తి చేసి 1185 మంది రైతులకు పాస్ పుస్తకాలు ఇవ్వడం ఎంత సంతోషంగా ఉందన్నారు. భూ యజమాని పేరు నమోదులో చిన్నపాటి అక్షర దోషాలు ఉన్న రెవెన్యూ అధికారులు వెంటనే సరిచేసి పాస్ పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు,వినుకొండ తహసిల్దార్ సురేష్ నాయక్, ప్రజా ప్రతినిధులు, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

11.04.26 శనివారం




# నేడు అంగరంగ వైభవంగా
# చెన్నకేశవస్వామి రథోత్సవం

**వాహనం ముందు భక్తుల సాంస్కృతిక కార్యక్రమాలు**
**వివిధ వేషధారణల మధ్య స్వామివారికి నగరోత్సవం**
**పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు**
**పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమాలు**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 10)**
చారిత్రక ప్రసిద్ధి చెందిన మార్కాపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి వివిధ రంగులతో విద్యుత్ దీపాలను అలంకరించారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 1 నుంచి నిర్వహిస్తున్నారు. ఈనెల 11వ తేదీ నేడు సాయంత్రం 4.30 గం టలకు రథోత్సవం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని చెన్నకేశవస్వామి, రాజ్యలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మార్కాపురంతోపాటు పరిసర ప్రాం తాల్లో, కర్నూలు, నంద్యాల, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారు ప్రతిరోజూ ఒక వాహనం పై ప్రత్యేక అలంకారంలో నాలుగు





మాడవీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లను వైభవంగా ఆలయ ఈఓ గొలమారి శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. వాహనాల్లో భాగంగా పొన్న వాహనం, హనుమంత వాహనం, గరుడ వాహనం, నేడు గజ వాహనాలకు (తరువాయి 4లో...)

# పరిశ్రమలకు సంబంధించి భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**




**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 10)**
రామయపట్నం పోర్టు అనుసంధానంగా ఏర్పాటు కానున్న పరిశ్రమలకు సంబంధించి చేపట్టిన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజాబాబు సబ్ కలెక్టర్ హిమవంశీతో కలిసి ఉలవపాడు తహసిల్దార్ కార్యాలయంను సందర్శించి రామాయపట్నం పోర్టు కు అనుసంధానంగా నిర్మించనున్న ఇండోసోల్ పరిశ్రమకు సంబంధించి ఉలవపాడు మండలం, కరేడు గ్రామ పరిధిలో చేపట్టిన భూసేకరణ ప్రక్రియ పురోగతి, అలాగే మండలంలో రెవెన్యూ సమస్యలు, గ్రీవెన్స్ అర్జీలను పరిష్కరిస్తున్న తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఇండోసోల్ పరిశ్రమ ఏర్పాటులో భాగంగా కరేడు గ్రామ పరిధిలో చేపట్టిన భూసేకరణ ప్రక్రియ పురోగతిని, రెవెన్యూ సమస్యలపై వచ్చిన ఆర్జీల పరిష్కారం విధానాన్ని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కరేడు గ్రామ పరిధిలో చేపట్టిన భూసేకరణ ప్రక్రియను (తరువాయి 4లో...)

# కందుల కృషితోనే మార్కాపురం జిల్లా, వెలుగొండ ప్రాజెక్టు పనులు వేగవంతం

**రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి**







# సీఎంవో గ్రీవెన్స్ అర్జీ పై స్పందించిన కలెక్టర్

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 10)**
భూ సమస్యపై సీఎంవోలో అందజేసిన అర్జీ పై మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత (తరువాయి 4లో...)


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేవదాయ, ధర్మదాయ శాఖ
శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి దేవస్థానం
మార్కాపురం



శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి దేవస్థానం బ్రహోత్సవములు
01-04-2026 నుండి 19-04-2026 వరకు





శ్రీ లక్ష్మి చెన్న కేశవ స్వామి వారి ఆలయంలో
త్వరలో ప్రతి శనివారరం
భక్తులకు అన్నదానం చేయుటకు
దేవస్థానం తరుపున
ఏర్పాట్లును చేయునున్నాము.
దాతలు సహకరించి దేవాలయం అభివృద్ధికి,
అన్నదానమునకు
సహకరించగలరని కోరుచున్నాము

11-04-2026 గజవాహానం
( ఉత్సవం 11-04-2026 ఉదయం 5.00 గం.)
11-04-2026 రథోత్సవం
కార్యక్రమానికి విచ్చేయుచున్న భక్తులందరికి
స్వాగతం.... సుస్వాగతం..........

గొలమారి శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వహణాధికారి మరియు సిబ్బంది

# నేడు అంగరంగ వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం


















పగలు ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. వాహనం ముందు భక్తుల సాంస్కృతిక కార్యక్రమాలు వివిధ వేషధారణల మధ్య స్వామివారికి నగరోత్సవం జరుగుతుంది. రథోత్సవంలో స్వామివారిని దర్శించుకోవడం తోపాటు భక్తులు రథాన్ని లాగి తమ మొక్కులు తీర్చుకుంటుంటారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు మార్కాపురం పట్టణానికి చేరుకుంటారు. రథోత్సవం సందర్భంగా పట్టణంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు అన్నదానం చేస్తారు.




# పరిశ్రమలకు సంబంధించి భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి



మిషన్ మోడ్‌లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు అందులో భాగంగా సర్వే ప్రక్రియను నెల రోజుల లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. మొత్తం భూమి ఎంత ఉంది, అందులో పట్టా భూమి, ప్రభుత్వ భూమి, డికేటి భూమి ఎంత వుంది, అందులో ఇప్పటివరకు ఎంత భూమి సర్వే చేశారు. తదితర వివరాలతో సంపూర్ణ నివేదిక రూపొందించడంతో పాటు రోజు వారీ లక్ష్యాలను నిర్దేశించుకుని త్వరితగతిన భు సేకరణ ప్రక్రియను పూర్తీ చేయాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. రెవిన్యూ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోని స్పష్టం చేశారు. గ్రీవెన్స్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీ తిరిగి రీ ఓపెన్ కాకుండా అర్జీదారులకు సహేతుకమైన ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపైనా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ, కందుకూరు డివిజన్ పరిధిలో రామయపట్నం పోర్టు అనుసంధానంగా బిపిసిఎల్, ఇండోసోల్, జిందాల్ వంటి మేజర్ పరిశ్రమలు ఏర్పాటు కానున్న నేపథ్యంలో, అందులో భాగంగానే ఇండోసోల్ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి ఉలవపాడు మండలం, కరేడు గ్రామంలో భూ సేకరణ ప్రక్రియ మొదలు పెట్టడం జరిగిందన్నారు. శుక్రవారం కందుకూరు సబ్ కలెక్టర్‌తో కలసి ఉలవపాడు తహసీల్దారు కార్యాలయంను విజిట్ చేసి భూసేకరణ ప్రక్రియ పురోగతిని సమీక్షించడం జరిగిందన్నారు. భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తీ చేయాలని భూసేకరణ అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. భూ సేకరణ ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా నిర్దిష్ట గడువులోపు పూర్తీ చేసేలా సంబంధిత అధికారులకు తగు సూచనలు, ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే మండలంలో రెవెన్యూ సమస్యలు, గ్రీవెన్స్ అర్జీలను పరిష్కరిస్తున్న తీరును సమీక్షించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ పి రాజాబాబుని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సమావేశంలో రామయపట్నం పోర్టు భూసేకరణ ఎస్డిసిలు నాగిరెడ్డి, నాసరయ్య, తహసిల్దార్ ఏ వి రవి శంకర్, సర్వే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కందుల కృషితోనే మార్కాపురం జిల్లా, వెలుగొండ ప్రాజెక్టు పనులు వేగవంతం

## రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 10)**

మార్కాపురం జిల్లా సాధన అయినా వెలుగొండ ప్రాజెక్ట్ రెండవ టన్నెల్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయంటే అవి మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కృషితోనే అని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మార్కాపురం ఇలవేల్పు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎస్వీకేపీ కళాశాల మైదాన ప్రాంగణంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సీనియర్ విభాగంలో పశు ప్రదర్శన పోటీలను తిలకించడానికి ముఖ్య అతిథులుగా ఆయన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చొరవతో త్వరలోనే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామని అన్నారు. అనంతరం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు మంత్రి, ఎమ్మెల్యేలను పూర్ణ కుభంతో ప్రత్యేకంగా ఆహ్వానించి ఆలయ విశిష్టత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్‌చైర్మన్‌మాలపాటి వెంకటరెడ్డి, జనసేన ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్, బిజెపి ఇన్చార్జి పివి కృష్ణారావు, బిజెపి సీనియర్ నాయకులు ఏలూరి రామచంద్ర రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





# సీఎంవో గ్రీవెన్స్ అర్జీ పై స్పందించిన కలెక్టర్

శుక్రవారం స్పందించారు. పెద్దారవీడు మండలం సానికవరం గ్రామానికి చెందిన తంగిరాల రాజారత్నం తన భూ సమస్యపై ఇటీవల అమరావతిలోని సీఎంఓ గ్రీవెన్స్ లో అర్జీ అందజేశారు. దీని పై స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ విజయ సునీత నేరుగా అర్జీ దారునితో ఫోన్లో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సమస్యను పరిష్కరిస్తామని అర్జీదారునికి చెప్పారు.

# పిల్లలు తక్కువ... అటెండెన్స్ ఎక్కువ ఉపాధ్యాయుల పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ఇంటూరి

**తెట్టు హైస్కూల్ ఆకస్మిక తనిఖీలో వెలుగుచూసిన వైనం**
**టీచర్లకు వార్నింగ్ - అధికారులకు ఫిర్యాదు**





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 10)
గుడ్లూరు మండలం తెట్టులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి క్లాస్ రూమ్, వంటగది పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్నం భోజనం, మెనూ అమలు, ఇతర సౌకర్యాలపై వారినుంచి సమాధానాలు రాబట్టారు. ఒకటి నుంచి 9 తరగతుల వరకు 128 మంది విద్యార్థులు చదువుతుండగా, ఎమ్మెల్యే తనిఖీ సమయంలో 100 మంది లోపే ఉన్నారు. కానీ విద్యార్థులందరూ 100% హాజరైనట్లు అటెండెన్స్ వేసినట్లు ఎమ్మెల్యే గుర్తించారు. దీంతో ఆయన ఉపాధ్యాయులు, హెచ్‌ఎం చిన్నయ్య పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికీ అటెండెన్స్ ఎందుకు వేశారని నిలదీయడంతో టీచర్లు నీళ్లు నమిలారు. కొంతమంది పిల్లలు వచ్చి వెళ్లిపోయారని, మరి కొంతమంది ఇంకా రాలేదని, ఉపాధ్యాయులు పొంతన లేని సమాధానాలు చెప్పడం పై ఎమ్మెల్యే వారిని మందలించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెంటనే డిప్యూటీ డీఈఓకు ఫోన్ చేసి, ఉపాధ్యాయుల తీరు పై ఫిర్యాదు చేశారు. ఇలాంటి విషయాల పై అప్పుడప్పుడు ఎందుకు తనిఖీ చేయడం లేదని పేరెంట్ టీచర్స్ అసోసియేషన్ చైర్మన్ రియాజ్, స్థానిక నేతలను ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇక నుంచి హైస్కూల్ లో పరిస్థితులను నిత్యం గమనిస్తూ ఉండాలని సూచించారు. హైస్కూల్ భవనం పై అంతస్తులో నిర్మాణం అసంపూర్తిగా ఉండటం వల్ల క్లాస్ రూములు సరిపోవటం లేదని విద్యార్థినులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆయన స్పందిస్తూ వేసవి సెలవులు అనంతరం బడులు తెరిచేలోగా పనులు పూర్తి చేయిస్తానని తెలిపారు.



## లింగారెడ్డిపల్లి హైస్కూల్‌లో 8వ పోషణ పక్వాడ పక్షోత్సవాలు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఏప్రిల్ 10)
కనిగిరి మండలం లింగారెడ్డిపల్లి హైస్కూల్ నందు మహిళా శిశు సంక్షేమ శాఖ కనిగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో "8వ పోషణ పక్వాడ- 2026" పక్షోత్సవాల కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవిఎస్ పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి గర్భధారణ నుండి 3 సంవత్సరాలలో బిడ్డ మెదడు అభివృద్ధి ఎక్కువగా జరుగుతుందని, తల్లి తీసుకునే పోషకాహారం, తల్లి పాలు, తల్లి బిడ్డ పరస్పర చర్యలు, ప్రేరణ, స్క్రీన్ సమయాన్ని తగ్గించడం, తాత, అమ్మమ్మలు కథలు చెప్పడం, బొమ్మలు, ఆటలు ఆడించడం వల్ల పిల్లల్లో మేధాశక్తి పెరుగుతుందన్నారు. 3-6 సంవత్సరాల పిల్లలకు ప్రీస్కూల్ విద్య, ఆట ఆధారిత విద్య గురించి తల్లిదండ్రులు, సమాజ పాత్ర గురించి, అంగన్వాడి కేంద్రాలను బలోపేతం చేయుట గురించి అవగాహన కల్పించారు. తదుపరి గ్రామంలో పోషణ పక్వాడా పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలోని గర్భవతులు, బాలింతలు, కిషోర్ బాలికలు, పిల్లలు, అంగన్వాడీ కార్యకర్తలు సరస్వతి, కళ్యాణి, రాజ్యలక్ష్మి, భాగ్యలక్ష్మి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

## నిరవధిక నిరాహారదీక్షను జయప్రదం చేయండి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 10)



ఈ నెల 11వ తేదీ అనగా శనివారం భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయం నందు బీసీలకు సంబంధించి ఐదు ముఖ్యమైన డిమాండ్ల పరిష్కార సాధన కోసం నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న సందర్భంగా ఆయనకు మద్దతుగా ఒంగోలు పట్టణంలోని కాటమరాజు విగ్రహం వద్ద 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నట్లుగా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని నిరవధిక నిరాహార దీక్ష కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. బీసీల అభివృద్ధి కోసం రామచంద్ర యాదవ్ చేస్తున్న దీక్ష అభినందనీయమైనదన్నారు. అందుకోసం తన వంతుగా తను కూడా మద్దతునిస్తూ నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నట్లుగా తెలిపారు. బీసీలకు రక్షణ చట్టం వెంటనే ఏర్పాటు చేయాలని, బీసీ కుల కార్పొరేషన్లకు వెంటనే నిధులు విడుదల చేయాలని, బీసీలకు అన్ని రంగాలలో 44 శాతం రిజర్వేషన్లు అమలు పరచాలని, రాజధానిలో బీసీలకు వెయ్యి ఎకరాలు భూమి కేటాయించాలని రామచంద్ర యాదవ్ నిరవధిక నిరాహార దీక్ష చేయాలని నిర్ణయం తీసుకోవడంతో అధికార, ప్రతిపక్ష పార్టీలకు నిద్ర పట్టటం లేదన్నారు.

## రామచంద్ర యాదవ్ ఫ్లెక్సీకి పాలాభిషేకం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 10)
శనివారం భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ బీసీ కులాలకు సంబంధించిన ఐదు ముఖ్యమైన డిమాండ్లతో మంగళగిరి వద్ద గల పార్టీ కేంద్ర కార్యాలయం నందు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సందర్భంగా కరేడు గ్రామ బస్టాండ్ వద్ద వినాయకుని గుడి దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించి రామచంద్ర యాదవ్ ఫ్లెక్సీ కి 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాస్ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని, బీసీ కార్పొరేషన్లకు వెంటనే నిధులు విడుదల చేయాలని, బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు అమలు పరచాలని రాజధాని ప్రాంతంలో బీసీలకు 10 ఎకరాలు భూమి కేటాయించాలని రామచంద్ర యాదవ్ బీసీల పక్షాన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా ఆమరణ నిరాహారదీక్ష చేయాలని నిర్ణయం తీసుకోవటం గొప్ప పరిణామమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి గత పాలక పార్టీలన్నీ కూడా బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప బీసీల పక్షాన చేసిందేమి లేదన్నారు. రామచంద్ర యాదవ్ బీసీ కనుక బీసీల బాధలు గుర్తించి వాటి పరిష్కారం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేయడం బీసీలకు శుభపరిణామమన్నారు. ఇక నేటి నుండి అధికార, ప్రతిపక్ష పార్టీలకు రామచంద్ర యాదవ్ సింహ స్వప్నంలా కనిపిస్తారన్నారు. రామచంద్ర యాదవ్ శనివారం నుండి చేయు ఆమరణ నిరాహార దీక్ష జయప్రదం కావాలని మొదటిగా వినాయకునికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అంగన్వాడి సెంటర్‌లో పోషణ పక్వాడ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సతీష్ బాబు



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 10)
ఏప్రిల్ 9 నుండి ఏప్రిల్ 23 వరకు జరుగుతున్న దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని జెడ్ మేకపాడు అంగన్ వాడీ సెంటర్లో పోషణ పక్వాడ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ వై సత్యవతి మాట్లాడుతూ ఉజ్వల ఆంధ్రప్రదేశ్ కోసం ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంపిక చేసుకోవాలని, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవటం ద్వారా ఆరోగ్యకరమైన ఎదుగుదలకి ఉపయోగపడుతుందని, రెండు సంవత్సరాలలోపు వయసులోనే మెదడు అభివృద్ధి 80 శాతం జరుగుతుందని, మంచి అలవాట్లు, మంచి పౌష్టికాహారం, పిల్లలకి అందించాలని, చిరుధాన్యాలు, పోషక ఆహారం ఆకుకూరలు అందించాలని, ప్యాక్ చేసిన జంక్ ఫుడ్ వల్ల కలిగే నష్టాలు, అలాగే మొబైల్ స్క్రీన్,టీవి ల వల్ల కలిగే నష్టాలు, ఇంటి లోపల ఆడే ఆటలు ఆలోచన శక్తిని సహకార భావాన్ని పెంచుతాయన్నారు. శారీరక ఆరోగ్యం కదలిక నైపుణ్యాలను మెరుగుపరుచుకోవచ్చని ఆమె అన్నారు. స్పెషల్ ఆఫీసర్ సతీష్ బాబు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు బాలింతలు పిల్లలు ఎక్కువ నీరు తాగాలని కొబ్బరి బోండాలు, మజ్జిగ, నిమ్మకాయ లాంటి పానీయాలు తీసుకొని వడదెబ్బ గురి కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో ఎండలో వెళ్లేటప్పుడు గొడుగు, లేదా స్కార్ఫ్ ఉపయోగించాలని, ప్రభుత్వం నుంచి అంగన్వాడి ద్వారా పంపిణీ చేసే ఆహారం లబ్ధిదారులు మాత్రమే తినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది, స్పెషల్ ఆఫీసర్ సతీష్ బాబు, పంచాయతీ సెక్రెటరీ నాయక్, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, ఆరు సంవత్సరాలలోపు పిల్లల తల్లులు పాల్గొన్నారు.

# 12న ఒంగోలులో జరిగే రైతు సంఘం 16వ మహాసభలను జయప్రదం చేయండి

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 10)
ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 16వ జిల్లా మహాసభలు ఈనెల 12న ఒంగోలులోని ఎన్జీరంగా భవన్‌లో జరుగుతున్నాయని ఆ సంఘం వలేటివారిపాలెం మండల కన్వీనర్ మాదాల రమణయ్య తెలిపారు. రైతు సంఘం జిల్లా మహాసభల కరపత్రాలను పోలినేనిపాలెం సెంటర్ లో రామాలయం వద్ద కరపత్రాలను ఆవిష్కరించి, రైతులకు పంపిణీ చేశారు. రైతు సంఘం మహాసభలకు మన ప్రాంతంలోని రైతులందరూ హాజరుకావాలని కోరారు. ఈ మహాసభలలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలైన సాగునీటి వనరులు, మార్కెట్ సంక్షోభం, ప్రకృతి వైపరీత్యాలు, గిట్టుబాటు ధరలు తదితర అంశాలపై చర్చించి, భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు వలేటి కృష్ణయ్య, కే ప్రభాకర రెడ్డి, తోపాటు జిల్లాలోని రైతు నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ మహాసభలను మన ప్రాంత రైతాంగం విజయవంతం చేయాలని కోరారు. ఈ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో రైతులు అనుములు లక్ష్మీ నరసింహం, గుత్తా సుధాకర్, కంచర్ల శ్రీను, సిహెచ్ నర్సింగరావు, పొట్లపల్లి వెంకటేశ్వర్లు, మామిళ్ళపల్లి మాల్యాద్రి, అనుముల వెంకటేశ్వర్లు, మేకనబోయిన వేదాచలం, ఏ కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.



## మా ఆసుపత్రికి వాచ్‌మెన్‌ను ఇవ్వండి సారు!

ప్రభుత్వ ఆసుపత్రిలో పర్మినెంట్ వాచ్ మెన్ కొరత
రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న మహిళా వైద్య సిబ్బంది
జిల్లా వైద్య అధికారులు స్పందించాలని గ్రామస్తులు డిమాండ్




**(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఏప్రిల్ 10)**
మండలంలోని మేదరమెట్ల గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల నందు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించే డాక్టర్లు ఉన్నప్పటికీ పర్మినెంట్ వాచ్ మెన్ లేకపోవడంతో ఆసుపత్రిలో పనిచేసే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో మహిళా సిబ్బంది నైట్ డ్యూటీ చేయాలంటే బిక్కు బిక్కు మంటూ భయం గుప్పెట్లో డ్యూటీ చేయవలసిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో ఎవరైనా ఆకతాయిలు ఇబ్బంది పెడితే పరిస్థితి ఏమిటి అని వారు ప్రశ్నిస్తున్నారు. ఏదైనా జరగరానిది జరిగితే బాధ్యులు ఎవరు అంటూ పలువురు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వాసుపత్రిలో ప్రజలతో మమేకమై మెరుగైన వైద్యం అందించే డాక్టర్లు, వైద్య సిబ్బంది ఉన్నారని వారికి కావలసిన సౌకర్యాలను చూసుకోవలసిన బాధ్యత జిల్లా వైద్య ఉన్నతాధికారుల మీద ఉందని గ్రామంలోని పలువురు ప్రజలు అభిప్రాయ వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వైద్య యంత్రం వెంటనే స్పందించి వైద్యశాలకు పర్మినెంట్ వాచ్ మెన్ ను కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నీటి భద్రత మన సమగ్రాభివృద్ధికి తోడ్పాటుతుంది

**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 10)**
నీటి భద్రత మన సమగ్రాభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని



మండల తెదేపా అధ్యక్షుడు పోద వీరయ్య అన్నారు. జల సంరక్షణ ప్రధాన అజెండాగా రాష్ట్రవ్యాప్తంగా 100 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల ఎంపిడిఓ కె ధనలక్ష్మి అధ్యక్షతన మండల తెదేపా అధ్యక్షుడు పోద వీరయ్య అధ్వర్యంలో తహశీల్దార్ జె ప్రభాకరరావు పర్యవేక్షణలో ఎంపిడిఓ కార్యాలయ సమావేశ మందిరంలో నీటి భద్రత, సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నీటి భద్రత, సాగునీటి సంఘాల బాధ్యత కార్యామన్ని ప్రజల్లో విస్తృతంగా తీసుకువెళ్లి అందరికీ అవగాహనకల్పించాలన్నారు. భూగర్భజలాల నీటి మట్టన్ని పెంపొందించే విధంగా ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వాడుకునే విధానాన్ని ప్రతి ఒక్క రైతుకు అర్థమయ్యేలా వివరించారు. అందుకు సంబంధించిన వ్యవసాయ పొలాల సాగు కాలువలను శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని నీటి సంఘాల అధ్యక్షులకు ఎంపిడిఓ కె ధనలక్ష్మి, తహశీల్దార్ జె ప్రభాకరరావు అదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి డిస్ట్రిబ్యూటర్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పొద వీరయ్య చౌదరి, ఎన్‌కేవి ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కలాం ఆజాద్, మండల ఉపాధ్యక్షులు కోకి భాస్కర్‌రెడ్డి, నరహరి శ్రీనివాసరావు, వాటుపల్లె ఏడుకొండలు , సెక్రటరీలు పాల్గొన్నారు.


## యర్రగొండపాలెం ప్రాంత వాసికి జిల్లా జడ్జిగా పదోన్నతి



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఏప్రిల్ 10)**
యర్రగొండపాలెం ప్రాంతనికి చెందిన దుపాటి విజయసారథి రాజు ప్రస్తుతం తిరుపతి నందు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు) శుక్రవారం విడుదల చేసిన ఉత్తర్వులలో విజయసారథి రాజుకి జిల్లా జడ్జిగా పదోన్నతి లభించింది. విజయసారథి రాజు 2008 లో మేజిస్ట్రేట్ గా న్యాయవ్యవస్థలో చేరి తదుపరి 2019 నుండి సీనియర్ సివిల్ జడ్జి గా పనిచేస్తున్నారు. తిరుపతి లో పనిచెయ్యడానికి పూర్వం విజయసారథి రాజు ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాలలో మేజిస్ట్రేట్ గా, సీనియర్ సివిల్ జడ్జిగా సేవలు అందించారు. విజయసారథి రాజు విద్యాభ్యాసం ఇంటర్మీడియట్ వరకు పూర్తిగా యర్రగొండపాలెం లోనే జరగడం విశేషం. గతంలో విజయసారథి రాజు తండ్రి స్వర్గీయ శేషం రాజు స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేసి పదవి విరమణ పొందారు. తమ ప్రాంత వాసి జిల్లా జడ్జి కావడం పట్ల యర్రగొండపాలెం ప్రజలు ఆనందం వ్యక్తం చేసారు.

# పుల్లలచెరువు చెరువులో 'పెయింటెడ్ స్టార్క్' వలస పక్షుల సందడి

### ప్రకృతి అందాలకు నిదర్శనంగా మారిన రామానాయుడు చెరువు



**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, ఏప్రిల్ 10)**
మండలంలోని పుల్లలచెరువు రామానాయుడు చెరువులో ఈ వేసవి కాలంలో వలస పక్షుల సందడి కనువిందు చేస్తోంది. ముఖ్యంగా 'పెయింటెడ్ స్టార్క్' జాతికి చెందిన కొంగలు పెద్ద సంఖ్యలో చెరువుకు చేరుకుని ప్రకృతి అందాలను మరింత అందంగా మార్చుతున్నాయి.
చెరువు మధ్యలో ఉన్న చెట్లపై గూళ్లు కట్టుకుని నివసిస్తున్న ఈ పక్షులు, ఉదయం మరియు సాయంత్రం వేళల్లో గుంపులుగా చెరువులోకి వచ్చి చేపలు, చిన్న జీవులను ఆహారంగా తీసుకుంటున్నాయి. పొడవైన కాళ్లు, పసుపు-నారింజ రంగు ముంచు, తెలుపు-నలుపు రంగుల రెక్కలతో ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రతి సంవత్సరం ఈ కాలంలో దూర ప్రాంతాల నుంచి వలసగా వచ్చే ఈ పక్షులు, నీటి వనరులు ఉన్న ప్రాంతాలను ఆశ్రయిస్తాయని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.
చెరువులో నీటి నిల్వ, ప్రశాంత వాతావరణం ఉండటంతోనే ఇవి పుల్లల చెరువును ఆశ్రయిస్తున్నాయని భావిస్తున్నారు. ఈ అరుదైన దృశ్యాన్ని చూడటానికి సమీప గ్రామాల ప్రజలు కూడా చెరువుకు చేరుకుంటున్నారు. పక్షుల సంరక్షణకు గ్రామస్థులు సహకరించాలని, చెరువు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.





# సోషల్ మీడియాలో నకిలీ ప్రొఫైల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 10)**
సాంకేతికత పెరుగుతున్న కొద్దీ కొత్త రకాల మోసాలు వెలుగులోకి వస్తున్నాయని, కొందరు సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ అకౌంట్లకు నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నారని ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ తరహా నేరాలకు పాల్పడుతున్న వారు ముందుగా ఫేస్‌బుక్‌లోకి ప్రవేశించి, ప్రైవసీ సెట్టింగ్స్ లేని ఖాతాల వివరాలను సేకరించి, ఆ వ్యక్తుల పోస్టులు, గుర్తింపు పరిశీలిస్తారు. అనంతరం ఆ ఖాతాల్లో ఉన్న ఫోటోలను డౌన్‌లోడ్ చేసి, వాటిని ప్రొఫైల్ ఫోటోలుగా ఉపయోగించి నకిలీ ఖాతాలు సృష్టిస్తారు. తర్వాత ఆ నకిలీ ఖాతాల ద్వారా ఫ్రెండ్స్ లిస్టులో ఉన్న వారికే మళ్లీ ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతారు. దీనివల్ల, ఎదుటి వారు అదే వ్యక్తి మరో ఖాతా తెరిచారని భావించి ఆ రిక్వెస్టులను అంగీకరిస్తున్నారని ఎస్పీ తెలిపారు. తర్వాత ఆ నకిలీ ఖాతాలను వినియోగిస్తూ కొన్నాళ్లు కొత్త ఫ్రెండ్స్‌తో చాటింగ్ చేసి, అనంతరం వివిధ కారణాలు చెబుతూ తమకు అత్యవసరంగా కొంత డబ్బు కావాలని, కొన్ని గంటల్లోనే తిరిగి ఇస్తామని చెప్పి తెలిసిన వారిని ఆన్‌లైన్ చెల్లింపు యాప్‌లకు డబ్బులు పంపాలని కోరుతున్నారని తెలిపారు. ఆ సందేశాలను నమ్మి నిజంగా అవసరమై డబ్బులు అడుగుతున్నారనే భావనతో వారు చెప్పిన ఆన్‌లైన్ చెల్లింపు యాప్‌లకు డబ్బులు పంపితే, వాటిని సైబర్ నేరగాళ్లు దోచుకుంటున్నారని, కాబట్టి ఫేక్ ప్రొఫైల్ మోసాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్, ట్విట్టర్ అకౌంట్ ల ద్వారా డబ్బులు అడిగితే సంబంధిత వ్యక్తులకు ఫోన్ చేసి నిర్ధారించుకోవాలి లేదా పోలీసులకు సమాచారం అందించాలి లేదా హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు కాల్ చెయ్యాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.

# రథోత్సవం నేపథ్యంలో ట్రాఫిక్ మార్పులు ప్రజలు, భక్తులు సహకరించాలి

### సిఐ సుబ్బారావు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 10)**
మార్కాపురం పట్టణంలో జరుగుతున్న శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం నిర్వహించనున్న రథోత్సవం దృష్ట్యా పట్టణంలో భారీగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉందని పోలీసు శాఖ సూచించిన ట్రాఫిక్ మార్పులకు ప్రజలు, భక్తులు సహకరించి రథోత్సవం వైభవంగా జరిగేలా చూడాలని మార్కాపురం సిఐ సుబ్బారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, ధార్మిక సంస్థలు, రాజకీయ పార్టీలు ఏర్పాటు చేస్తున్న ఎలక్ట్రికల్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు, డయాస్‌లు కారణంగా ప్రధాన రహదారులపై రద్దీ పెరగనుంది. ఈ నేపథ్యంలో పోలీస్ శాఖ ఉన్నతాధికారులు, ఆర్‌టీసీ అధికారులు కలిసి ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కంభం బస్టాండు నుంచి కంభం వైపు వెళ్లే బస్సులు తర్లుపాడు మార్గం లేదా చెరువు కట్ట మీదుగా బైపాస్ మార్గం ద్వారా మళ్లించబడతాయి. దోర్నాల రోడ్డు మార్గాన వెళ్లే బస్సులు కూడా చెరువు కట్ట మీదుగా బైపాస్ ద్వారా దోర్నాల వైపు మళ్లించబడతాయి. ప్రయాణికులు, ప్రజలు ఈ మార్పులను గమనించి ముందస్తుగా ప్రయాణ ప్రణాళికలు చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణలో పోలీస్, ఆర్‌టీసీ అధికారులకు సహకరించాలని కోరారు. మనం అందరం కలిసి శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను ఎటువంటి అవాంతరాలు లేకుండా విజయవంతంగా నిర్వహించుకుందామని ఆయన ఆకాంక్షించారు.




# హోరాహోరీగా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

ఎడ్ల పోటీలను తిలకించేందుకు నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజానీకం
ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి
విజేతలకు బహుమతులు అందజేత







**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 10)**
మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఎస్వీకేపి కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు మూడో రోజైన శుక్రవారం హోరా హోరీగా సాగాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సీనియర్ కేటగిరి విభాగంలో జతల ఎడ్లు పందెంలో పాల్గొనేందుకు వచ్చాయి. బండను లాగేందుకు ఎడ్లు తీవ్రంగా పోటీపడ్డాయి. రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలు పోటీలను తిలకించారు. ఎడ్ల పందాలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. గెలుపొందిన ఎడ్ల జతలకు నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి సుంకి సురేందర్‌రెడ్డి రూ. 1,20,000 (హుజూర్ నగర్, సూర్యాపేట జిల్లా), ద్వితీయ బహుమతి అచ్చోట శిరీషా శివకృష్ణ చౌదరి రూ. 90,000, (వేటపాలెం, బాపట్ల జిల్లా), తృతీయ బహుమతి బోరెడ్డి కేశవరెడ్డి రూ. 70,000 (పెద్దకొట్టాల గ్రామం, నంద్యాల జిల్లా), నాల్గో బహుమతి పావులూరి వీరస్వామి చౌదరి రూ. 50,000 (బల్లికురవ, బాపట్ల జిల్లా), ఐదో బహుమతి బాపతి కొండారెడ్డి రూ. 40,000 (చాగలమర్రి గ్రామం, నంద్యాల జిల్లా), 6వ బహుమతి తిండి నరసింహారెడ్డి రూ. 30,000 (బోడిచర్ల గ్రామం, ప్రకాశం జిల్లా), ఏడో బహుమతి ఐతా సత్యనారాయణరాజు రూ. 20,000 (కొప్పోలు గ్రామం, నల్గొండ జిల్లా)లు విజయం సాధించి బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, జనసేన ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్, బిజెపి ఇన్చార్జి పివి కృష్ణారావు, బిజెపి సీనియర్ నాయకులు ఏలూరి రామచంద్రరెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కనిగిరి ప్రాజెక్టు కార్యాలయం నందు 8వ పోషణ పక్వాడ పక్షోత్సవాలు




**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఏప్రిల్ 10)**
మహిళా శిశు సంక్షేమ శాఖ కనిగిరి ప్రాజెక్ట్ కార్యాలయం నందు 8వ పోషణ పక్వాడ 2026 పక్షోత్సవాల కార్యక్రమం ప్రాజెక్ట్ సి డిపిఓ పి సరోజిని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కార్యకర్తలను, సూపర్వైజర్‌లను ఉద్దేశించి మాట్లాడుతూ 9వ తేదీ నుండి 23వ తేదీ వరకు ప్రతి గ్రామ స్థాయిలోనూ, సచివాలయ స్థాయిలోను 8వ పోషణ పక్షోత్సవాలను జరపాలన్నారు. ప్రతి గ్రామంలో కూడా గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన పోషకహారం, 0-3 సంవత్సరాల పిల్లలకు తల్లిపాలు ఇస్తూ అదనపు పోషకహారం అందించడం, 3-6 సంవత్సరాల పిల్లలకు స్క్రీన్ టైమ్ తగ్గించి, మెదడు పెరుగుదలకు సహకరించే ఆటలు, పాటలు, కథలతో పిల్లల బాల్యం సాగాలని తల్లులకు వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లు పద్మజ, పార్వతి, జరీనా, సుమతి, ధనలక్ష్మి, మల్లేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూకని ఈశ్వరమ్మకు ఘన నివాళులర్పించిన ప్రముఖులు

(షణ్ముఖ వెలుగు, దొనకొండ, ఏప్రిల్ 10)

ఏపియుడబ్ల్యుజె ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు ఎన్వి రమణ మాతృమూర్తి స్వర్గీయ నూకని ఈశ్వరమ్మ పెద్ద కర్మ కార్యక్రమం సందర్భంగా స్వగ్రామమైన మండలంలోని దేశిరెడ్డిపల్లె గ్రామంలో వారి నివాసం వద్ద జరిగింది. ఈ సందర్భంగా టిడిపి, వైసిపి, సిపిఐ, సిపిఎం, జనసేన, కాంగ్రెస్, బిజెపి తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, ఎపియుడబ్లూజె నాయకులు, పలు ప్రజా సంఘాల ప్రతినిధులు, బంధు మిత్రులు హాజరై నూకని ఈశ్వరమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన వారిలో ఒంగోలు మాజీ ఎంపీ కరణం బలరాం కృష్ణమూర్తి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, వైసిపి స్టేట్ సెక్రెటరీ డాక్టర్ మీర్జా షంషీర్ ఆలీబేగ్, బిసి జాతీయ సంఘం అధ్యక్షులు పిఎల్పి యాదవ్, మార్కాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళి క్రిష్ణ, శ్రీరామ్ చిట్స్ ఏజీఎమ్ జి. చంద్ర బాబు,రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, మార్కాపురం, ఒంగోలు బ్రాంచి మేనేజర్స్ ఎస్ వెంకటేశ్వరరెడ్డి, రాఘవ, మార్కాపురం నియోజక వర్గ జనసేన పార్టీ నాయకులు శ్రావణి వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సిహెచ్ అంజమ్మ శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, పార్టీ నాయకులు అందే నాసరయ్య, జిల్లా ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి ఎస్ కె యాసిన్, సిపిఎం జిల్లా కార్యదర్శి డి సోమయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్ కె సైదా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గుమ్మా బాల నాగయ్య, ఎస్ వి కెపి డిగ్రీ కళాశాల మాజీ అధ్యాపకులు పత్తి వెంగన్న, డాక్టర్ ఊర్మిళ మురళి, జిల్లా ఇంచార్జి ఆర్టీవో చంద్ర రాంబాబు, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్ర శేఖర్ రెడ్డి,యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఒద్దుల వీరారెడ్డి, టిడిపి రాష్ట్ర పరిశీలకులు శాసనాల వీరబ్రహ్మం, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, టిడిపి రాష్ట్ర బిసి సెల్ సెక్రెటరీ కనిగిరి బాల వెంకట రమణ, పార్టీ సీనియర్ నాయకులు పఠాన్ హుస్సేన్ ఖాన్,గొట్టం శ్రీనివాస రెడ్డి, ఎన్



జీవో అసోసియేషన్ సెక్రెటరీ వడ్లమాని శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ ఎస్.చంద్ర శేఖర్,ప్యాసింజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ కె జి నరసింహం, రెడ్డి సేవా సంఘం అధ్యక్షుడు, మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి, ఏపి ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, సెక్రెటరీ ఎస్ కె.మస్తాన్ వలి, ఏపి యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర సెక్రెటరీ ఏ సురేష్, జిల్లా సెక్రెటరీ డి కనకయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఇఫ్తేకర్ భాష, స్టేట్ కౌన్సిల్ సభ్యులు మూల అల్లూరిరెడ్డి, జిల్లా జాయింట్ సెక్రెటరీ బంకా శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకట రామిరెడ్డి, మాజీ ఏపిపి ఉమ్మడి రవీంద్ర, రాష్ట్ర వాల్మీకి మహర్షి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, తదితరులు ఉన్నారు. ఈశ్వరమ్మ మృతి సమాచారాన్ని తెలుసుకున్న పలువురు ప్రముఖులు ఆమె కుమారుడు ఎన్ వి రమణ ను కలిసి పరామర్శించి, ఆమె మృతి పట్ల విచారాన్ని, సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు ఐవి. సుబ్బారావు, మాజీ ఎమ్మెల్యే లు కెపి నాగార్జున రెడ్డి, అన్నా రాంబాబు, జంకే వెంకటరెడ్డి, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి, వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు వెన్నా హనమారెడ్డి, మాజీ ఎంపీపి పోరెడ్డి చెంచిరెడ్డి, సీఐ పి సుబ్బారావు, నియోజక వర్గ జనసేన పార్టీ ఇంచార్జి ఇమ్మడి కాశీనాథ్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం ఎల్ నారాయణ, నాయకులు అందే నాసరయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.సోమయ్య, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఎస్ కె ఇస్మాయిల్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కె.నగేష్, ఎమ్ పి జె రాష్ట్ర అధ్యక్షులు ఎస్ కె అబ్దుల్ రజాక్, బిజెపి నియోజక వర్గ నాయకులు పీవీ క్రిష్ణ రావు, వైసిపి నాయకులు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, శ్రీ వాసవి కన్యాక పరమేశ్వరి డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ బి. డేవిడ్ స్టోన్,శ్రీ వెంకటేశ్వర ఐటిఐ కళాశాల చైర్మన్ గుంపల్లి రత్నం శెట్టి, వైసిపి నాయకులు ఎమ్.ఉత్తమ్ కుమార్, పలువురు జర్నలిస్టులు,"శాఖజెజీ నాయకులు తదితరులు ఎన్ వి రమణను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

# కన్నుల పండుగలా ఆల్ఫా స్కూల్ ఫేర్వెల్ డే సంబరాలు




(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 10)

స్థానిక పొదిలి పట్టణంలోని ఆల్ఫా స్కూల్లో ఫేర్వెల్ డే సంబరాలు అంబరాన్ని తాకాయి. ఈ సందర్భంగా తొమ్మిదవ తరగతి, పదవ తరగతి విద్యార్థినీ, విద్యార్థులచే ప్రదర్శించబడిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకుల హృదయాలను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆల్ఫా పాఠశాలల చైర్మన్ మాలకొండారెడ్డి, ముఖ్య అతిథిగా విచేసిన పొదిలి పట్టణ ఎస్ఐ సూరెడ్డి రాజేష్ కుమార్, కంభం ప్రిన్సిపల్ రితీష్ నాయర్, పొదిలి పట్టణ ఆల్ఫా స్కూల్ ప్రిన్సిపల్ వేల్పుల వెంకట్, ఇతర అతిథులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌరవ అతిథులు విద్యార్థినీ, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించి అనేక సూచనలు, విలువైన సలహాలను అందించారు. విద్యార్థులు తమ భావి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడానికి అవసరమైన అమూల్యమైన విషయాలను ఉపదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆల్ఫా అధ్యాపక బృందం, అధ్యాపకేతర బృందం, విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# గోపవరం ఎస్సీ కాలనీలో సోలార్ ప్యానల్‌ను ప్రారంభించిన విద్యుత్ శాఖ ఎస్ఈ సోమా శ్రీనివాసులు

(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఏప్రిల్ 10)

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శనివారం ఏపీ ఎస్పీడీసీఎల్ సూపర్డెంట్ ఇంజనీర్ సోమ శ్రీనివాసులు చేతుల మీదుగా సోలార్ ప్యానల్స్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎస్సీ సోమా శ్రీనివాసులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో ఎస్సీ ఎస్టీ కాలనీలో పేద కుటుంబాలకు విద్యుత్ బారంతో ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం పీఎం సూర్య ఘర్ పథకశీ సమన్వయంతో ఉచిత సోలార్ ప్యానల్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బద్వేల్ నియోజకవర్గం గోపవరంలో మండలం ఎస్సీ కాలనీలో మొట్టమొదటి సారిగా సోలార్ ప్యానల్స్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. అట్లూరు మండలం 95, బద్వేల్ టౌన్ 50, గోపవరం మండలం 121, కలసపాడు మండలం 50, పోరుమామిళ్ల మండలం 193, కాశీనాయన మండలం 100, బి కోడూరు మండలం 87 మొత్తం 696 కుటుంబాలకు సోలార్ ప్యానల్ కనెక్షన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా ఎస్సీ కాలనీలోని పేద కుటుంబాలకు కరెంటు బిల్లు నుంచి విముక్తి లభిస్తుందన్నారు. పర్యావరణానికి మేలు చేయడమే కాకుండా పేదల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం అన్నారు. కావున ఈ అవకాశాన్ని నియోజకవర్గ స్థాయిలో ప్రజలు ఉపయోగించుకోవాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం కులాయప్ప అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివకుమార్, సోలార్ కాంట్రాక్టర్ గిరీష్, పలువురు విద్యుత్‌శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





# యుటిఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 10)

యుటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ప్రకాశం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ హై ఆధ్వర్యంలో శుక్రవారం సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. మహిళా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్య రాణి, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత లకు వినతిపత్రాలు ఇవ్వడం జరుగుతుందని రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు తెలియజేశారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులలో 50% మహిళా ఉపాధ్యాయ పనిచేస్తున్నారని, వారికి పని చేసే పాఠశాలలో అనేక చోట్ల స్టాఫ్ రూమ్స్, టాయిలెట్లు వంటి కనీస సౌకర్యాలు లేవన్నారు. లైంగిక వేధింపులు, భద్రతా సమస్యలతో నిత్యం ఎదుకోవాల్సి వస్తుందన్నారు. వారి ఇబ్బందుల పరిష్కారం కోసం యుటిఎఫ్ రాష్ట్ర సంఘం మంత్రులకు వినతిపత్రాలు ఇస్తామని తెలియజేశారు. వివిధ జిల్లాల నుండి మహిళ ఉపాధ్యాయుల సంతకాల సేకరణ అనంతరం ఈ వినతిపత్రాలను రాష్ట్ర సంఘానికి పంపించడం జరుగుతుందన్నారు. అక్కడ రాష్ట్ర సంఘం ముగ్గురు మంత్రులకు ప్రాతినిధ్యం చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్ రవి మాట్లాడుతూ మహిళ టీచర్ల భద్రత నిమిత్తం ఒక ప్రొటెక్షన్ సెల్ జిల్లా స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు పనిచేసే పాఠశాలలో ప్రశ్నాపత్రాలు పుస్తకాలు తీసుకురావడం, రైస్ ఇండెంట్ ఇవ్వడం, మొదలగు పనుల నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఒత్తిడి తగ్గించేందుకు ప్రతి హైస్కూల్లో ఒక స్ట్రెస్ మేనేజ్మెంట్ కౌన్సిలర్‌ను ఏర్పాటు చేయాలని, పిల్లల అనారోగ్యం, చదువు నిమిత్తమే కాకుండా పెళ్లి అయిన బిడ్డలకు తీవ్ర అనారోగ్యం ఆపరేషన్, డెలివరీ సమయాల్లో కూడా వినియోగించుకునే విధంగా చైల్డ్ కేర్ లీవును మార్పు చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉచిత న్యాయ సలహా కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం సంధ్యారాణి, ఝాన్సీ లక్ష్మీబాయి, నన్నమూరి లక్ష్మి శివ పార్వతి, శారద, శ్రీదేవి, షేక్ హాజీరా బేగం, పి ఉషారాణి, జిల్లా సహాధ్యక్షుడు వై వెంకట్రావు, జిల్లా కోశాధికారి ఎన్ చిన్న స్వామి, జిల్లా కార్యదర్శి సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి, యర్రా శ్రీనివాసరావు, ప్రభాకర్‌రెడ్డి, జి శ్రీనివాసరావు, షేక్ అబ్దుల్ ఖాదర్, జిలాని, తదితరులు పాల్గొన్నారు.

## నీటి సంరక్షణ పై అవగాహన గ్రామసభలో కీలక చర్చ



(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, ఏప్రిల్ 10)

మార్కాపురం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని పుల్లలచెరువు స్వర్ణ గ్రామంలో నీటి భద్రత, నీటి సంఘాల బాధ్యతలపై గ్రామసభ నిర్వహించారు. గ్రామ స్థాయిలో నీటి వినియోగ నియంత్రణ, చెరువుల పరిరక్షణ, జల వనరుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశంగా అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పుల్లలచెరువు గ్రామ పంచాయతీ పరిధిలోని కాటమరాజు చెరువు వద్ద జల సంరక్షణ కార్యక్రమాలు నిర్వహించి, చెరువుల సంరక్షణ, వర్షపు నీటి వినియోగం, నీటి వృథాను తగ్గించే చర్యలపై గ్రామస్థులకు వివరించారు. నీటి భద్రతలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అధికారులు పేర్కొన్నారు. ఈ గ్రామసభలో ఎంపీడీవో మరియదాసు, ఇరిగేషన్ శాఖకు చెందిన అధికారులు, ఏపిఓ మోషే, పంచాయతీ అభివృద్ధి అధికారి సాయి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామ సిబ్బంది, నీటి సంఘం ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## వేసవి వేడిలో ఉపశమనం స్వర్ణగ్రామంలో చలివేంద్రం ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, ఏప్రిల్ 10)

పుల్లలచెరువు గ్రామంలోని స్వర్ణగ్రామం (సచివాలయం 1) వద్ద శుక్రవారం చలివేంద్రాన్ని టిడిపి మాజీ మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్ ప్రారంభించారు. పెరుగుతున్న వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు చల్లని తాగునీరు అందించేందుకు ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పంచాయతీ సెక్రటరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ద్వారా సచివాలయం పరిసరాలకు వచ్చే ప్రజలు, ప్రయాణికులు చల్లని నీటిని పొందే వీలుందని పేర్కొన్నారు. ఈ సదుపాయాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్, ఎంపీడీవో మరియదాసు, ఏపిఓ మోషే, పంచాయతీ సెక్రటరీ సాయి, స్వర్ణగ్రామం సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పోషకాహారం అవసరం పోషణ పక్వాడలో అవగాహన కార్యక్రమాలు



(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, ఏప్రిల్ 10)

మండల కేంద్రంలోని ఎస్టీ సెంటర్‌లో శుక్రవారం 8వ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని రెండవ రోజు నిర్వహించారు. ఈ నెల 9వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ కెవి సుబ్బమ్మ మాట్లాడుతూ తల్లులు, చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే పోషకాహారం ఎంతో ముఖ్యమని, జంక్ ఫుడ్ మరియు ప్రాసెస్డ్ ఫుడ్‌ను పూర్తిగా నివారించాలని తెలిపారు. ఇటువంటి ఆహారం వల్ల పిల్లల శారీరక, మానసిక వికాసంపై ప్రతికూల ప్రభావం ఉంటుందని ఆమె వివరించారు. తల్లులు పిల్లలకు మంచి ఆహారపు అలవాట్లు అలవాటు చేయాలని, ఇంట్లో పెద్దలు అయిన అమ్మమ్మలు, తాతయ్యలు పిల్లలకు కథలు చెప్పడం, ఆటలు నేర్పించడం ద్వారా వారి మానసిక వికాసానికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాతృశిశు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు, డెమో సెషన్లు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అలాగే చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహారం ప్రాముఖ్యతపై తల్లులకు ప్రత్యేకంగా సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

# సామాజిక చైతన్య బైక్ యాత్రకు డిమాండ్స్ పైలాన్ ఆవిష్కరణ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 10)

కెవిపిఎస్ ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 11 నుండి 14 వరకు జరగనున్న సామాజిక చైతన్య బైక్ యాత్రకు సంబంధించిన డిమాండ్స్‌ను శుక్రవారం ఎల్బీజీ భవన్‌లో ఘనంగా పైలాన్ రూపంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యుడు, దళిత సేనాన రాష్ట్ర అధ్యక్షుడు కాకి కృపారావు మరియు రాష్ట్ర అధ్యక్షుడు పేకా మధుసూదన్‌రావు కలిసి పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దళితులపై కొనసాగుతున్న అన్యాయాలు, వివక్షత, మౌలిక వసతుల కొరత, ఉపాధి అవకాశాల లోపం వంటి సమస్యలను ఎలుగెత్తి పరిష్కారం కోసం ఉద్యమాలు రూపకల్పన చేయడంలో ఈ బైక్ యాత్ర ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి డిమాండ్లను అమలు చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో కార్మికుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, కనీస వేతనాలు, ఉపాధి హామీ పథకాల అమలులో లోపాలు ఉన్నాయని తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మరియు కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి. బాలకోటయ్య మాట్లాడుతూ, కార్మికులు,రైతులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, రుణభారం, పంట నష్టాలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రస్తావించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ, వ్యవసాయ రంగానికి తగిన మద్దతు లేకపోవడం వల్ల కొద్దో గొప్ప సాగు చేసుకుంటున్నా దళిత రైతులు సంక్షోభంలో ఉన్నారని పేర్కొన్నారు. ఐలు జిల్లా నాయకులు ఢీకొల్లి ఏడుకొండలు మాట్లాడుతూ, చట్టపరమైన హక్కుల పరిరక్షణలో ఉన్న లోపాలు, దళితులపై జరుగుతున్న అణచివేతపై పలు ముఖ్యమైన అంశాలను వివరించారు.కాంగ్రెస్ యూత్ నాయకులు శ్రీపతి సతీష్ మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు వర్గాల సమస్యలపై కెవిపిఎస్ చేస్తున్న బైక్ యాత్రకు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్, ప్రస్తుత జిల్లా కార్యదర్శి వీరాస్వామి పాల్గొన్నారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురామ్ మాట్లాడుతూ ఈ సామాజిక చైతన్య బైక్ యాత్ర ప్రకాశం జిల్లాలోని 13 మండలాల్లో 42 గ్రామాలలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను వెలికి తీసి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే లక్ష్యంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వి మోజేష్, తదితరులు పాల్గొన్నారు. ఈ బైక్ యాత్ర ద్వారా సామాజిక న్యాయం, సమానత్వం సాధన కోసం విస్తృత స్థాయిలో ప్రచార ఉద్యమం ముందుకు సాగుతుందని నాయకులు వ్యక్తం చేశారు.




# చీరాలలో వైసిపి విస్తృతస్థాయి సమావేశం

## గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపు

(షణ్ముఖ వెలుగు, చీరాల, ఏప్రిల్ 10)

రామకృష్ణాపురం క్యాంపు కార్యాలయం నందు వైసిపి నియోజకవర్గస్థాయి బూత్ కమిటీ కన్వీనర్లతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశీలకులు ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, జిల్లా అధ్యక్షులు నాగార్జున, నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ కరణం వెంకటేష్, పరిశీలకులు బసవ పున్నారెడ్డి లు పాల్గొని మాట్లాడారు. త్వరలో మున్సిపాలిటీ, స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే ప్రతి బూత్ లలో పటిష్టంగా పనిచేయాలని అన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలలోకి బలంగా తీసుకువెళ్లాలని వారు దిశా నిర్దేశం చేశారు. గెలుపే లక్ష్యంగా కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలని వారు సూచించారు. కార్యకర్తలను కలుపుకొని కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలో వైసీపీకి ఓట్ బ్యాంకు ఉందని దానికి అనుగుణంగా కార్యచరణ చేయాలని సూచనలు చేశారు. వచ్చే ఏడాది నుంచి జగనన్న పాదయాత్ర ఉంటుందని పాదయాత్ర లోపు బూత్ లెవెల్‌లో మరింత పటిష్టం కావాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బూత్ కమిటీ కన్వీనర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.









# వైభవంగా శ్రీలలితా పరమేశ్వరి అమ్మవారి పున విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

(షణ్ముఖ వెలుగు, బద్వేలు, ఏప్రిల్ 10)

బద్వేలు నియోజకవర్గం బి కోడూరు మండలం నరసింహపురం గ్రామంలో శ్రీ లలిత దేవి అమ్మవారి దేవాలయం పునర్నిర్మాణం విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం వేద పండితులు కనుమల్ల సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. శ్రీ లలితా పరమేశ్వరి అమ్మవారి ఆలయానికి వెంకట గణేష్ ట్రేడర్స్ తులసి నాగరాజా, లలిత కుటుంబ సభ్యుల సహకారంతో దాదాపు నిర్మాణానికి కృషి చేశారు. అలాగే వారితో పాటు పల్లె రామసుబ్బారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఎస్ఆర్ఎంబి లాడ్జి అధినేత రాచపూడి దిలీప్ గుప్తా, పలువురు దాతల సహకారంతో ఆలయ పుణ నిర్మాణం విగ్ర ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఆలయ ధర్మకర్త ఎడవల్లి గురయ్య, గ్రామ పెద్దలు తెలిపారు. శుక్రవారం జరిగిన అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ఆర్యవైశ్య వర్తక సంఘం మాజీ అధ్యక్షులు కె వి సుబ్బారావు, ఆవోప సెక్రెటరీ సివి నాగేశ్వరరావు, వల్లంకొండు వెంకటరమణ, తులసి కౌశిక్, రమణ, పలువురు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు, వేద పండితులు సత్యనారాయణ శర్మ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ప్రత్యేక ప్రసాదాలను వారికి అందజేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన వివిధ రకాల ప్రత్యేక హోమాలు, విశేష పూజలలో గ్రామంలోని పలువురు పాల్గొని తమ భక్తిని చాటుకుని అమ్మవారికి కాయ కర్పూరం సమర్పించుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ప్రత్యేక తీర్థప్రసాదాలు అందజేస్తూ ఆలయ అభివృద్ధికి కృషి చేసిన పలువురు దాతలకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, కమిటీ సభ్యులు, వేద పండితులు పాల్గొన్నారు.








On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# పేదల ఆరోగ్య భరోసాగా ఎమ్మెల్యే ఏలూరి నాలుగు కుటుంబాలకు రూ.9.30 లక్షల సిఎం సహాయనిధి ఎల్ఓసీలు అందజేత

## ఆపదలో అండగా నిలిచి వైద్య సాయం అందించిన ఎమ్మెల్యే



(షణ్ముఖ వెలుగు, మార్టూరు, ఏప్రిల్ 10)

ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, వారి వైద్య చికిత్సలకు భరోసా కల్పిస్తూ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. వైద్య చికిత్స కోసం ఎదురుచూస్తున్న ఆ పేద కుటుంబాలకు ఎమ్మెల్యే ఏలూరి తనవంతు కర్తవ్యంగా క్యాంపు కార్యాలయంలోని వైద్య విభాగం ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలతో అత్యవసర చికిత్స అందించేలా చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలోని నాలుగు పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఎల్ఓసీల ద్వారా మొత్తం రూ.9,30,825 వైద్యసాయం అందేలా చర్యలు తీసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించి, ఒక్కరోజులోనే అనుమతులు సాధించడంపై బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు.

కడవకుదురు గ్రామానికి చెందిన గడ్డం రమణ ఐదు రోజుల క్రితం ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి విషమించడంతో వైద్యులు ఆమె కుడికాలు తొలగించాల్సి వచ్చింది. ప్రస్తుతం గుంటూరులోని ఆదిత్య మెడికోవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న భర్త గడ్డం బాబు వైద్య ఖర్చులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుల ద్వారా ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి వెళ్లింది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.1,33,180 ఎల్ఓసీ మంజూరు చేయించారు. చెక్కును బాపట్ల పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి నక్కల రాఘవ అందజేశారు. గంగవరం గ్రామానికి చెందిన బోడెంపూడి రాజలక్ష్మి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. కుటుంబ సభ్యులు ఆమెను తాడేపల్లిలోని మెడ్‌స్టార్ ఆసుపత్రిలో చేర్పించగా, వైద్యులు శస్త్రచికిత్స అవసరమని సూచించారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న భర్త కనకయ్య కుటుంబ పరిస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి రూ.2,04,260 ఎల్ఓసీ మంజూరు చేయించారు. చెక్కును పీఏసీఎస్ చైర్మన్ బోడెంపూడి సుబ్బారావు, స్థానిక నాయకులు అందజేశారు. మార్టూరు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌బీకి రెండు నెలల క్రితం పాప జన్మించింది. పుట్టిన వెంటనే శిశువుకు తీవ్ర అనారోగ్యం, బ్రెయిన్ స్ట్రోక్ సమస్యలు తలెత్తడంతో అప్పటి నుంచి చికిత్స కొనసాగుతోంది. ఇటీవల గుంటూరులోని కనుమూరి ఆసుపత్రికి తరలించగా అత్యవసర చికిత్స అవసరమని వైద్యులు తెలిపారు. వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న భర్త షేక్ గౌస్ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో స్థానిక నాయకులు ఎమ్మెల్యే ఏలూరిని ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ఆయన ఒక్కరోజులోనే రూ.4 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించి కుటుంబానికి ఊరట కల్పించారు. చెక్కును టీడీపీ సీనియర్ నాయకులు ఆదినారాయణ, రజాక్, శ్రీనివాసరావు, ఏసుపాదం, సూర్యనాయక్ అందజేశారు. ఈ అన్నంబోట్లవారిపాలెం గ్రామానికి చెందిన ఈదరా సాంబశివరావు గత రెండేళ్లుగా గుండె సమస్యతో బాధపడుతున్నారు. గుంటూరులోని కిమ్స్ ఆసుపత్రిలో పరీక్షించగా అత్యవసరంగా స్టెంట్లు వేయాలని వైద్యులు సూచించారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆయన కుటుంబం వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఎమ్మెల్యేను ఆశ్రయించింది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.1,93,385 ఎల్ఓసీ మంజూరు చేయించారు.





## యువకుడికి చేయూతనిచ్చిన టిడిపి నేత మాకం అబ్రహం



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఏప్రిల్ 10)


మార్కాపురం మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మాకం అబ్రహం దాతృత్వానికి పలువురు ప్రశంసిస్తున్న సంఘటన వెలుగులోకి వచ్చింది. మార్కాపురం మండలం చింతకుంట గ్రామానికి చెందిన రెడ్డే పోగు కాసయ్య అనే యువకుడు



బాడుగకు ఆటో తోలుతూ కుటుంబాన్ని పోషిస్తూ కష్టపడేవాడు. అంతేకాకుండా గ్రామానికి చెందిన టిడిపి నేత అబ్రహం కు చేదోడు వాదోడుగా ఉంటూ పార్టీకి నమ్మకంగా ఉండేవాడు. దీంతో యువకుడికి ఏదో ఒక సహాయం చేయాలని ఉద్దేశంతో శుక్రవారం అతను చేస్తున్న వృత్తికి పనికొచ్చే విధంగా సుమారు రూ.3 లక్షలు విలువ చేసే మొత్తం ఖర్చు అబ్రహామే తానే భరిస్తూ ఒక ఆటో అతనికి తీసి ఇవ్వడం జరిగింది. దీంతో మండలలోని పలువురు టిడిపి నేత అబ్రహం చూపిన దాతృత్వానికి ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే అబ్రహం మాత్రం మా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆశయాలకు, ఆలోచనలకు, అనుగుణంగా పని చేస్తున్నానని చెప్పడం విశేషం. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపి నాయకులు, యువత పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా యూనిట్ నూతన పాలకవర్గం ఎన్నిక

### చైర్మన్ గా జివివి రాఘవరెడ్డి



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఏప్రిల్ 10)

బాపట్ల జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్ల యూనిట్ నూతన పాలకవర్గ చైర్మన్‌గా జివివి రాఘవరెడ్డిని నియమించినట్లు ఏపిజిఈఏ రాష్ట్ర అధ్యక్షులు కె ఆర్ సూర్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా ఈ కమిటీ పనిచేస్తుందని ప్రకటించారు. కొత్త కమిటీ వివరాలు ఇలా ఉన్నాయి. చైర్మన్‌గా జివివి రాఘవరెడ్డి, కన్వీనర్ గా పి శ్రీనివాసరావు, సభ్యులుగా కె రోషయ్య, ఐ సుధాకర్‌రావు, కె అంజిబాబు, వై రాజేష్ బాబు, ఎన్ పెద్ద పుల్లారావు, జె మర్త, టి తరుణ్ రాజ్‌లు ఎన్నికయ్యారు. బాపట్ల జిల్లా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నూతన పాలకవర్గం కృషి చేయనుంది. ఈ సందర్భంగా నూతన కమిటీ చైర్మన్ జివివి రాఘవరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా కమిటీకి చైర్మన్‌గా నియమించినందుకు రాష్ట్ర నిర్ణాయక కమిటీ ఏపిజిఈఏ రాష్ట్ర అధ్యక్షులు కే ఆర్ సూర్యనారాయణ, జనరల్ సెక్రటరీ ఎం రమేష్ కుమార్, రాష్ట్ర కమిటీ పెద్దలు, ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలియజేసారు. తన పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఏపిజిఈఏ అభివృద్ధికి, ఉద్యోగుల సంక్షేమానికి, సేవ చేయడానికి, చట్టపరిధిలో ఉంటూ నిరంతరం శ్రమిస్తూ ఉద్యోగులందరిని కలుపుకుని పోతూ సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## మోచర్ల సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు 11 మందికి గాను డ్యూటీలో ఉన్నది ఒక్కరే

### సిబ్బంది నిర్లక్ష్యంపై కలెక్టర్ కు ఎమ్మెల్యే ఫిర్యాదు




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 10)

గుడ్లూరు మండలం మోచర్ల గ్రామసచివాలయంలో 11 మంది సిబ్బంది పనిచేస్తుండగా శుక్రవారం ఒక్కరు మాత్రమే డ్యూటీలో ఉన్నారు. మిగతా పదిమంది ఉదయాన్నే రిజిస్టర్ లో సంతకాలు చేసి వెళ్లిపోయారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీకి వెళ్లడంతో సిబ్బంది నిర్లక్ష్యం వెలుగు చూసింది. సచివాలయ ఉద్యోగులు విధులకు సక్రమంగా రావడం లేదని, తెట్టు గ్రామస్తులు శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన సచివాలయానికి ఆకస్మికంగా వెళ్లారు. ఆ సమయంలో డిజిటల్ అసిస్టెంట్ ఒక్కరే ఉన్నారు. పది మందిలో ముగ్గురు మాత్రం గుడ్లూరు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశానికి హాజరైనట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు, మిగిలిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారికి మెమోలు ఇవ్వాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఆ తర్వాత కలెక్టర్ రాజాబాబుకు, సచివాలయ ఉద్యోగుల పనితీరు పై ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న వారి పై చర్యలకు సిఫార్సు చేశారు.





## రెండవ రోజు జనాభా గణన పై శిక్షణా తరగతులు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 10)

స్థానిక మండల కేంద్రం అయిన ఉలవపాడు లో గవర్నమెంటు హై స్కూల్ నందు జనగణన-2027లో భాగంగా మొదటి బ్యాచ్ ఎనిమిరేటర్లు మరియు సూపర్వైజర్ లకు రెండవ రోజు ఇండ్ల జాబితా గణన పై శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగింది. సెన్సస్ ఛార్జ్ ఆఫీసర్ అయిన తహశీల్దారు ఏవి రవి శంకర్ శిక్షణా కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లపై తగు సూచనలు చేశారు శిక్షణా తరగతులు ఉదయం, మధ్యాహ్నం ఎనిమిరేటర్‌లు, సూపర్వైజర్లకు ఇండ్ల జాబితా గణనలో అడిగే ప్రశ్నలు గురించి పూర్తి స్థాయిలో ఫీల్డ్ ట్రైనర్‌లు పున్నేపల్లి శ్రీనివాసులు, షేక్ బాబ్జీ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎనిమిరేటర్‌లు, సూపర్వైజర్‌లకు ఉన్న సందేహాలు నివృత్తి చేశారు. ప్రస్తుత ఇండ్ల గణన మొదటసారి డిజిటల్ మోడ్‌లో చేస్తున్నాం కనుక ఏ విధంగా హెచ్ఎల్ఓ యాప్ వినియోగించాలో, ఇండ్ల జాబితా గణనకు ఏవిధంగా సన్నధం కావాలో సూచనలు చేశారు. అదే విధంగా స్వీయ గణన గురించి వివరించారు.

# ప్రపంచ హోమియోపతి దినోత్సవం సందర్భంగా వైద్య శిబిరం





**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 10)**

హోమియోపతి వైద్య విధాన వ్యవస్థాపకుడు డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హానెమాన్ జయంతి, ప్రపంచ హోమియోపతి దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో హోమియో వైద్యులు డాక్టర్ డి . చంద్రశేఖర్ అధ్వర్యంలో ఉచిత వైద్య పరిక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది రోగులకు పరీక్ష చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా హోమియో డాక్టర్ డి చంద్రశేఖర్ మాట్లాడుతూ హోమియోపతి పితామహుడి సేవలను, వైద్య రంగానికి ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. సురక్షితమైన, సున్నితమైన మరియు శాస్త్రీయమైన హోమియోపతి చికిత్స విధానంపై ప్రజల్లో అవగాహన పెరగలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# నేతాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఘనంగా 8వ వార్షికోత్సవ వేడుకలు



**(షణ్ముఖ వెలుగు, బద్వేలు, ఏప్రిల్ 10)**

నేతాజీ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో శుక్రవారం 8వ వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయని ప్రిన్సిపాల్ అనుమల విజయలక్ష్మి తెలియజేసారు. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విభాగాల చిన్నారులకు కాన్వికేషన్ డే నిర్వహించి వారికి ప్రత్యేక గుర్తింపు అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు వంటి కల్చరల్ ఆక్టివిటీస్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పాఠశాల వార్షికోత్సవం విద్యార్థుల ప్రతిభను, శ్రమను, సాధనలను ప్రదర్శించే ముఖ్యమైన వేదికగా నిలిచింది.

# అద్దంకికి రూ.2.70 కోట్లు మంజూరు

**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 10)**



అద్దంకి నియోజకవర్గంలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.2.70 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో ఏపీ ట్రాన్స్‌కో సిఎస్ఆర్ నిధుల కింద ఒక్కో హాల్‌కు రూ.30 లక్షల చొప్పున మొత్తం 9 గ్రామాలకు నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నంబూరివారిపాలెం, వెంకటాపురం, రామాయపాలెం, వేలమూరిపాడు, చక్రాయపాలెం, శ్రీరామ్ కాలనీ, ఎల్ఈఎఫ్ నగర్, గోవాడ, ధర్మవరం గ్రామాల్లో హాళ్లు నిర్మించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ప్రజా కార్యక్రమాలకు ఇవి ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు.

# ప్రజల సమక్షంలోనే సమస్యల పరిష్కారానికి పల్లె నిద్ర

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

**(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 10)**

ప్రజల సమక్షంలోనే వారి సమస్యలను పరిష్కరించేందుకు ' పల్లెనిద్ర ' చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. శుక్రవారం ఆయన మండలంలోని పోతవరం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక శివాలయం వద్ద గ్రామస్తులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు ప్రస్తావించిన సమస్యలను ఓపికతో విని వాటి పరిష్కారానికి అప్పటికప్పుడే అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులతోనూ కలెక్టర్ ప్రత్యేకంగా ముచ్చటించారు.

### గ్రామ సమస్యలు ఇవీ...

గ్రామంలో సీసీ రోడ్లు వేయాల్సిన అవసరం ఉంది. అలాగే దెబ్బ తిన్న పోతవరం – తిమ్మాయిపాలెం రోడ్డు కు మరమ్మత్తు లు చేపట్టాలి. సైడ్ డ్రెయిన్లు నిర్మించాలి. తానంచింతల గ్రామంలో రోడ్డు ఆక్రమణ గురైంది. ఆక్రమణ తొలగించి రోడ్డు వెడల్పు చేయాల్సిన అవసరం ఉంది. గ్రామ సమీపంలో వున్న చెరువుకు దర్శి కెనాల్ నుండి నీటిని సరఫరా చేయాలి. భూ సమస్యలను పరిష్కరించి పట్టాదారు పాసు పుస్తకాలు ఇప్పించాలి. గ్రామంలోని వాటర్ ట్యాంకు ను క్లీన్ చేయాలి. ఈ నియోజకవర్గంలో నీటి సమస్య ఎక్కువగా ఉంది. నీటి సమస్య పరిష్కారానికి అధికారుల



చొరవ చూపాలి. తాత్కాలికంగా మంజూరు కాబడిన సదరన్ సర్టిఫికెట్స్ స్థానంలో పర్మనెంట్ సదరన్ సర్టిఫికెట్స్‌గా మంజూరు చేయాలి. మండలంలో ఎక్కువ సంఖ్యలో అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనంలో నడుస్తున్నాయి, వీటికి సొంత భవనాలు నిర్మించాలి. దేవరం గ్రామంలో చాలా సంవత్సరాలుగా సుమారు 90 మంది సన్నకారు, చిన్న కారు రైతులు ప్రభుత్వ భూమిని సాగు చేసుకోవడం జరుగుచున్నది. సాగుచేసుకుంటున్న రైతులకు గుర్తింపు కార్డు ఇప్పించాలి. దర్శి నియోజకవర్గం పరిధిలో చాలా మంది డయాలసిస్ పేషంట్స్ ఉన్నారు. వీరు చికిత్స నిమిత్తం మార్కాపురం, కనిగిరికి పోతున్నారు. దర్శి ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి.



ఈ సమస్యల పరిష్కారానికి తక్షణమే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముందుగా గ్రామంలోని శివాలయంలో ప్రత్యేకంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఆలయ సమీపంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యురాలు, దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంఛార్జి గొట్టిపాటి లక్ష్మి, అద్దంకి ఆర్‌డిఓ జాన్సన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.








# సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

## ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు

**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 10)**



ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు అన్నారు. శుక్రవారం చీఫ్ విప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించగా చీఫ్ విప్ జీవి హాజరై ప్రజల నుండి వినతుల స్వీకరించారు. ప్రజా సమస్యలను సత్వర పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహించి నేరుగా సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపటం జరుగుతుందన్నారు. ఐజిఆర్ఎస్ ద్వారా ఫిర్యాదులు నమోదు చేసుకొని నిర్ణీత కాలంలో పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. సమస్యలను ప్రజా దర్బార్ కు తెచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. వినుకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల నుండి ప్రజా దర్బార్ కు 80 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదు దారులతో చీఫ్ విప్ జీవి ఆంజనేయులు మాట్లాడి స్వయంగా సమస్యలు తెలుసుకొని సంబంధితశాఖ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశించారు.





# సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్య రక్ష



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 10)**

సహజ సేద్యాన్ని ప్రోత్సహిస్తూ రసాయన బెడద లేని ఆరోగ్యకర ఆహారాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో చిన్నగంజాం మండలం రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో సేంద్రీయ పద్ధతితో పండించినటువంటి పండుమిర్చిని కొనుగోలు చేయ్యటం జరుగుతుందని మండల ఎపిఎమ్ సుబ్బారావు అన్నారు. మండలంలో శుక్రవారం ఎపిఎమ్ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చిన్నగంజాం మండలం రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య అధ్వర్యంలో సేంద్రీయ పద్ధతితో పండించినటువంటి పండుమిర్చి కోనగోలు కేంద్రన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎపిఎమ్ సుబ్బారావు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్య పరిరక్షణ వుంటుందన్నారు. మండలంలో రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య అధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ఎఫ్‌పిఓ ద్వారా కోనుగోలు చేయ్యనున్నట్లు తెలిపారు. శుక్రవారం సాయిని అమర్నాథ్ సంతరావూరు గ్రామానికి చెందిన ఒక రైతు పూర్తిగా సేంద్రియ పద్ధతితో పండించిన మర్చిని రూ.120ల ధరతో కోనుగోలు చేసినట్లు తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య వారు సేకరించిన సేంద్రియ ఉత్పత్తులు కావాలిసిన వారు 9030120160 నెంబర్‌ని సంప్రదించాలని తెలియాజేసారు. ఈ కార్యక్రమంలో సిసిలు రంగస్వామి, శ్రీలక్ష్మి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.




# జూదం, బెట్టింగ్ పై నిఘా

**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, ఏప్రిల్ 10)**

పుల్లలచెరువు పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ కార్యకలాపాల నియంత్రణకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ బి సాంబశివరావు తెలిపారు. జూదం, క్రికెట్ బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు సమాజంలో శాంతి భద్రతలకు ముప్పుగా మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో యువత బెట్టింగ్ వైపు ఆకర్షితులవుతున్నారని, ఇలాంటి అక్రమ కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు పోలీసులు నిరంతరం నిఘా పెంచి పరిస్థితులను గమనిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో ఏవైనా అనుమానాస్పద లేదా చట్టవిరుద్ధ చర్యలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.